

ఎదురీత బతుకు..
భరోసా కరువు
● దుర్భరం.. గజ ఈతగాళ్ల జీవనం
● సాహసాలు వారికి నిత్యకృత్యం
● ప్రాణాలు పణంగా పెట్టినా దక్కని గుర్తింపు
7

సర్వే 97 శాతం

- చివరి అంకానికి చేరిన వివరాల సేకరణ
- మెదక్ జిల్లాలో 2,25,187 కుటుంబాలు
- 2,18,111 ఇళ్లకు వెళ్లిన ఎన్యూమరేటర్లు
- నేటితో 100 శాతం సర్వే పూర్తయ్యే అవకాశం
- ప్రారంభమైన డేటా ఎంట్రీ
- మున్సిపాలిటీలు, ఎంపీడీవో ఆఫీసుల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- సంగారెడ్డి జిల్లాలో 85 శాతం



హవేళీఘణపూర్‌లో సమగ్ర సర్వే డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్/మెదక్‌అర్బన్/హవేళీఘణపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే చివరి అంకానికి చేరుకుంది. సామాజిక, ఆర్థిక, విద్య, కుల వివరాలు నమోదు చేయడమే లక్ష్యంగా ఈ సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. మెదక్ జిల్లాలో 1,613 మంది ఎన్యూమరేటర్లు ఇందు కోసం నియమించారు. ఈ నెల 6న ఇంటింటికి స్టిక్కరింగ్, 9న వివరాల నమోదు ప్రారంభించారు. శుక్రవారం నాటికి 97 శాతం సర్వే పూర్తిచేసినట్టు జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి బద్రీనాథ్ తెలిపారు. 2,25,187 కుటుంబాల వివరాలు నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా.. ఇప్పటి వరకు 2,18,111 ఇళ్లను సందర్శించి వివరాలను సేకరించినట్టు వివరించారు. శనివారం సాయంత్రానికి సర్వే పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. సర్వే దాదాపుగా పూర్తికావడంతో డేటాఎంట్రీని పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్, ఎంపీడీవో కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డేటాఎంట్రీ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. ఇందుకోసం 369 మంది ఆపరేటర్లను నియమించారు.

ఆర్థిక సమాచారం ఇచ్చేందుకు ససేమిరా..

సర్వేలో ప్రజలు తమ ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, అప్పుల వివరాలను ఎన్యూమరేటర్లకు తెలపడానికి ఇష్టపడలేదని తెలుస్తున్నది. కొందరైతే ఆధార్, రేషన్ కార్డు వివరాలు కూడా ఇవ్వలేదని ఎన్యూమరేటర్లు తెలిపారు. కొన్ని గ్రామాల్లో పట్టాదారు పాసుపుస్తకాల

మిగతా 8వ పేజీలో..



మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత

- మిల్క్‌పార్లర్లు, క్యాంటీన్లు కేటాయింపు
- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాచరణ

సంగారెడ్డి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం నడుం బిగించింది. స్వయంఉపాధి అవకాశాలు కల్పించి వ్యాపార రంగంలో రాణించేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే చిరు వ్యాపారాలకు చేయూతనిస్తున్న సర్కారు ఇందిరా మహిళా శక్తి పథకం పేరిట మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నది. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా మహిళా సంఘాల సభ్యులకు మిల్క్‌పార్లర్లు, క్యాంటిన్లను కేటాయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నది.

ఇందిరా మహిళా శక్తి పథకం

జిల్లాలో మొత్తం 695 గ్రామైక్య సంఘాలు, 18,795 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా, మొత్తం లక్షా 90 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ప్రతీ మహిళను కోటీశ్వరురాలిగా చేయాలన్నదే ఇందిరా మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా 13 అంశాలపై మహిళలకు ఉపాధి అకాశాలు కల్పించనున్నది. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులను ఇందిరా మహిళా శక్తి పథకంలో ఎంపికచేసి శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నది. ఈ పథకం కింద క్యాంటిన్ల ఏర్పాటు కోసం రూ.3 లక్షల చొప్పున, మిల్క్‌పార్లర్ల కోసం రూ.2లక్షల చొప్పున రుణాలు ప్రభుత్వం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ రుణాలను తీసుకున్న సభ్యులు నెలావారీగా చెల్లించాల్సి ఉంటుంది.

10 క్యాంటిన్లు, ఒక మిల్క్‌పార్లర్

సంగారెడ్డి జిల్లాలో ఇందిరా మహిళా శక్తి పథకం మొదటి దశలో ప్రయోగాత్మంగా పది మహిళా శక్తి క్యాంటిన్లు, ఒక మిల్క్‌పార్లర్‌ను ఏర్పాటు చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఇప్పటికే మిల్క్‌పార్లర్‌ను ఏర్పాటు చేశారు. హత్నూర మండలం నస్తీపూర్, పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్లలో క్యాంటీన్లను వినియోగంలోకి తెచ్చారు. సదాశివపేట, కంది, నారాయణఖేడ్, అందోలుతో పాటు సంగారెడ్డిలోని పాత డీఆర్‌డీఏ కార్యాలయ ఆవరణలో, కలెక్టరేట్‌లో, జహీరాబాద్, ఝరాసంగంలో క్యాంటిన్లను ఏర్పాటు చేయనున్నారు. మరిన్ని క్యాంటిన్లు, మిల్క్‌పార్లర్ల కోసం జనం రద్దీగా ఉండే ప్రదేశాలను ఎంపిక చేశారు. ఇవేకాకుండా మహిళా సంఘాల ద్వారా డెయిరాఫాం, కోళ్లఫారం, పాడిగేదెల పెంపకం, ఆహారశుద్ధి యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలి. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కలెక్టరేట్‌లో మిల్క్ పార్లర్‌ను మహిళా సంఘం ద్వారా ఏర్పాటు చేయించి నిర్వహిస్తున్నాము. త్వరలో కలెక్టరేట్, కంది, ఝరాసంగం కేతకీ సంగమేశ్వరాలయం సమీపంలో క్యాంటిన్లను వినియోగంలోకి తీసుకురాబోతున్నాము.

- జ్యోతి, డీఆర్‌డీవో సంగారెడ్డి

నేటి నుంచి ప్రత్యేక ఓటరు నమోదు

సంగారెడ్డి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఓటరు నమోదు కోసం ఈ నెల నేడు, రేపు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. 18 సంవత్సరాలు నిండినవారందరూ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు నమోదు చేసుకోనివారికి మరోసారి అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి ఎన్నికల సిబ్బంది ఓటర్ నమోదు దరఖాస్తులను స్వీకరిస్తారని వెల్లడించారు. నూతన ఓటరు నమోదు ఫారం 6తో పాటు తప్పుల సవరణ, చిరునామా మార్పు, చనిపోయిన వారిపేర్లు జాబితా నుంచి తొలగింపులకు కూడా ప్రత్యేక ఓటరు కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. ఈ అకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ ఇలాగేనా?

- టైంపాస్ చేస్తున్నారా? జీతం ఇచ్చేది ఇందుకేనా?
- మీ నిర్లక్ష్యంతో అధికారులకు చెడ్డపేరు
- జీజీహెచ్ ఫార్మసీ సూపర్‌వైజర్‌పై టాస్క్‌ఫోర్స్ ఆగ్రహం
- రెండు వారాల్లో చక్కబెట్టుకోవాలని అడిషనల్ డైరెక్టర్ సుధీర హెచ్చరిక



ఫార్మసీ సూపర్‌వైజర్‌ను ప్రశ్నిస్తున్న టాస్క్‌ఫోర్స్ సభ్యులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని డ్రగ్‌స్టోర్‌ను స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. అడిషనల్ డైరెక్టర్, పీహెచ్‌వో డా.సుధీర, మైక్రోబయోలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.స్నేహజిగీష, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ తదితరులు ఆస్పత్రి మందుల స్టోర్‌ను

మిగతా 8వ పేజీలో..



మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అరెస్ట్
● చనిపోయిన సోదరుడి పేరిట ఉన్న భూమి కాజేసేందుకు యత్నం
● గెజిటెడ్ అధికారి సంతకం ఫోర్జరీ
7

ప్రజాసేవకు అంకితం కావాలి
● మెదక్ జిల్లాకు 149 మంది కొత్త కానిస్టేబుళ్ల కేటాయింపు
● రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ విధులు నిర్వర్తించాలి
● మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి
7

భార్యతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని.. అంతమొందించాడు
● వ్యక్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు
● నిందితుడికి రిమాండ్
7



హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలులో కొర్రీలు.. రోడ్డెక్కిన అన్నదాతలు

161 జాతీయ రహదారిపై రాస్తారోకో

అల్లాదుర్గం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో అధికారులు, మిల్లర్లు పెడుతున్న కొర్రీలతో ఆగ్రహం చెందిన అన్నదాతలు అధికారుల తీరును నిరసిస్తూ శుక్రవారం రోడ్డెక్కెరు. మండలంలోని సీతానగర్ గ్రామానికి చెందిన రైతులు రాంపూర్ వద్ద 161వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. సీతానగర్‌లో కొనుగోలు కేంద్రం తెరిచిన నెలరోజులకు తూకం ప్రారంభించారని, తేమశాతం 15 ఉన్న వడ్లను విక్రయించినా రైస్‌మిల్లర్లు తేమ అధికంగా ఉందని దించుకోవడం లేదని వాపోయారు. బస్తాకు కిలో అదనంగా తరుగు ఇస్తేనే వడ్లు దించుకుంటామని కొర్రీలు పెడతున్నారని ఆరోపించారు. వడ్లు దించుకోకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోయారు. హైవేపై భారీగా వాహనాలు నిలచిపోవడంతో పోలీసులు చేరుకుని నచ్చజెప్పినా రైతులు వినలేదు. ఆర్ఐ శరణప్ప, ఐకేపీ ఏపీఎం నాగరాజు రైతులతో మాట్లాడి అదనంగా తరుగు తీయకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రెడ్డిపల్లిలో విచారణ

మండలంలోని రెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసాలపై శుక్రవారం తహసీల్దార్ విచారణ జరిపారు. ఆర్.ఐ శరణప్పతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. మరోసారి ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.



రామాయంపేటలో నిర్మాణ దశలోనే నిలిచిపోయిన తహసీల్దార్ భవనం

8

నిలిచిన నిధులు.. ఆగిన పనులు

- ఆరేళ్లుగా ఆగిన రూ.70 కోట్ల నిధులు.. నిర్మాణ దశలో నిలిచిన భవనాలు
- వెక్కిరిస్తున్న శిలాఫలకాలు.. శిథిల భవనాలు, అద్దె ఇళ్లలోనే ఆఫీసులు



జిన్నారం 1002 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిలో వేస్తున్న సీసీరోడ్డు

ఈ రోడ్డు ఎవరి కోసం? నిధులు ఎక్కడివి?

- ప్రభుత్వ భూమి నుంచి సీసీ రోడ్డు ఏర్పాటుపై ఫిర్యాదులు
- ప్రైవేటు భూముల కోసమేనని ఆరోపణలు

జిన్నారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జిన్నారం శివారులోని 1002 ప్రభుత్వ భూమి నుంచి చేపట్టిన సీసీ రోడ్డు పనులపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమి నుంచి ఎవరి అనుమతితో.. ఎవరి కోసం రోడ్డు వేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. 90 అడుగుల మేర సీసీరోడ్డు నిర్మాణానికి సిద్ధమవగా స్థానికులు పనులను అడ్డుకున్నారు. జిన్నారం శివారులోని 1002 సర్వే నంబర్‌లో ప్రభుత్వ కళాశాల, జూనియర్ కళాశాల, వ్యవసాయ గిడ్డంగి, మినీ స్టేడియం కోసం కేటాయించిన స్థలాలు ఉన్నాయి. పాఠశాల, జూనియర్ కళాశాలల ముందు నుంచి ఉన్న మట్టి రోడ్డును 90 అడుగల వెడల్పుతో సీసీరోడ్డుగా మార్చేందుకు పనులు ప్రారంభించారు. ప్రభుత్వ స్థలం నుంచి ఎవరి కోసం.. ఏ శాఖ నిధులు వెచ్చించి రోడ్డు వేస్తున్నారని ప్రజలు నిలదీస్తున్నారు. జిన్నారం, పటాన్‌చెరు ప్రధాన రహదారి నుంచి చేపట్టిన పనులను స్థానికులు మూడు రోజుల క్రితం అడ్డుకున్నారు. తహసీల్దార్, ఎంపీ రఘునందన్‌రావుకు ఫిర్యాదు చేశారు.

వెంచర్ల కోసమని ఆరోపణలు

ఊట్ల పంచాయతీ పరిధిలో ఉన్న పలు ప్రైవేటు వెంచర్ల కోసమే ప్రభుత్వ స్థలం నుంచి సీసీరోడ్డు పనులు చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ భూములను ప్రధాన రహదారితో అనుసందానం చేయడానికే ఈ రోడ్డును నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. కొందరు నాయకుల ప్రమేయంతోనే పనులు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఔరా.. బుల్లి శాస్త్రవేత్తలు

సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన రెండో రోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగింది. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పలు రకాల ఎగ్జిబిట్లను ప్రదర్శనకు ఉంచారు. జిల్లా నలు మూలల నుంచి వందలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనకు తరలివచ్చి ఎగ్జిబిట్లను ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల ఆవిష్కరణలు ఆలోచింపజేసేలా ఉన్నాయని పలువురు అభినందించారు. నేటితో బాల వైజ్ఞానిక ప్రదర్శన ముగియనున్నది.

-సంగారెడ్డి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)



మొక్క అడుగు భాగం వరకు నీరందించేందుకు రూపొందించిన ప్రత్యేక వ్యవస్థ నమూనా



ప్రమాదాన్ని ముందే పసిగట్టి హెచ్చరించేందుకు ఏఐ టెక్నాలజీతో అనసంధానించిన హెల్మెట్



హిందీ సులభంగా అర్థమయ్యేలా రూపొందించిన ఎగ్జిబిట్



జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని బాబానగర్‌లో నెలరోజులుగా మిషన్ భగీరథ నీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని బోరు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో పొలాల బోర్ల వద్ద నీటిని తెచ్చుకుంటున్నారు. -జహీరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)

చెట్లు నరికి.. దుకాణాలు

- యథేచ్ఛగా అటవీ భూమి ఆక్రమణ
- నిబంధనలకు విరుద్ధంగా కల్లు, మద్యం అమ్మకాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు



పలుగుమీది పోచమ్మ ఆలయానికి ఎదురుగా అటవీ ప్రాంతంలో వెలసిన దుకాణాలు

హత్నూర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నా, అవి నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. విలువైన భూములు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. చెట్లు నరికినా పరవాలేదు.. చేతులు తడితే చాలు అన్న చందంగా మారింది అటవీశాఖ అధికారుల తీరు. ఒక్కో దుకాణానికి ఒక్కో రేటు చొప్పున డబ్బులు ముట్ట చెబుతున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. హత్నూర మండలం శేర్ఖాన్‌ఖాన్‌పల్లి గ్రామ శివారులో ప్రసిద్ధిగాంచిన పలుగుమీది పోచమ్మ తల్లి ఆలయం అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉంది. అక్కడ నిత్యం పరిసర గ్రామాలతో పాటు హైదరాబాద్, సంగారెడ్డి, నర్సాపూర్ వంటి ప్రాంతాల నుంచి భక్తులు వందల సంఖ్యలో వచ్చి పోతుంటారు. ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతంలో విందులు వినోదాలు చేసుకుంటుండడంతో ఇదే అదునుగా భావించిన స్థానికులు కొందరు అమ్మవారి ఆలయం పరిసరాలలో సర్వే నెంబరు 99లోని అటవీ భూముల్లో చెట్లను నరుకుతూ కబ్జా చేస్తూ, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ రేకుల షెడ్లలో కల్లు, మద్యం దుకాణాలు నిర్వహిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా మాంసం ఇతరత్రా వంటకాలు చేసి బార్లను తలదన్నేలా తినుబండరాలు విక్రయిస్తున్నారు. ఇలా శేర్ఖాన్‌పల్లి, నత్నయపల్లి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణ కొనసాగుతుంది.

అధికారుల కనుసైగల్లోనే...

గత కొంతకాలంగా ఆక్రమణలు కొనసాగుతున్నా.. అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో దుకాణానికి ఒక్కో రేట్ చొప్పున కొందరు అధికారులకు డబ్బులు చెల్లిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అటవీ శాఖ అధికారుల కనుసైగాల్లోనే ఈ తంతు కొనసాగుతుందని పరిసర గ్రామాల ప్రజలు కొందరు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అటవీ భూమి ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అటవీ ప్రాంతంలో చెట్లను నరికి ఏర్పాటు చేసిన దుకాణం

నోటీసులు జారీ చేశాం..

రిజర్వ్‌డ్ ఫారెస్టులో భూమి ఆక్రమించి దుకాణాలు నెలకొల్పిన విషయం వాస్తవమేనని వావిలాల సెక్షన్ ఆఫీసర్ షాహినీ తెలిపారు. అక్కడ రిజర్వ్‌డ్ ఫారెస్టులో ఉన్న భూములు, దుకాణదారులు అందరికీ ఇటీవల నోటీసులు జారీ చేశామని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ భూములను ఆక్రమించిన దుకాణాదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రస్థాయికి 25 మంది క్రీడాకారులు



మెదక్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 10వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జిల్లాస్థాయి పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభుకుమార్‌గౌడ్ ప్రారంభించారు. అండర్-8, 10, 12 బాల బాలికలకు రన్స్, త్రో, జంప్స్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 25 మంది వచ్చే నెల డిసెంబరు 1న మంచిర్యాల జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు.

ప్రకృతి విపత్తు సంభవించి వరదలు వచ్చినా.. ప్రమాదవశాత్తు ఎవరైనా నీటిలో పడిపోయినా... సహాయక చర్యలు చేపట్టాలంటే ముందుగా గుర్తుచ్చేది గజ ఈతగాళ్లే. ఎంత లోతైనా, నీటి ప్రవహం ఎంతున్నా వారు గంగకు ఎదురెళ్లి సాయం అందించాలి. ప్రాణాలు పణంగా పెట్టి సాహోసోపేతంగా సాయమందిస్తారు. వారి సమస్యలు తెలుసుకుంటే ఎవరికైనా గుండె చెరువవ్వాల్సిందే. వేగంగా వస్తున్న నీటికి ఎదురు ఈద గలుగుతున్నారు కానీ జీవితమనే నావను నడపకలేకపోతున్నారు. లోతైన బావిలో దరిని తాకి వస్తున్నారు కానీ వారికి గుర్తింపు కోసం సరైన దారి దొరకటం లేదు.

ఎదురీత బతుకు.. భరోసా కరువు

దుర్భరం.. గజ ఈతగాళ్ల జీవనం

- నీళ్లలోని మృతదేహాలను వెలికితీయడమే పని
- సాహసాలు వారికి నిత్యకృత్యం..
- ప్రాణం పణంగా పెట్టినా దక్కని గుర్తింపు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



సిద్దిపేట కోమటి చెరువు వద్ద గజ ఈతగాళ్లు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రం కోమటి చెరువు పరిసర ప్రాంతాల్లోని ఎన్టీఆర్‌నగర్‌లో గత కొన్నేళ్లుగా కొన్ని కుటుంబాలు ఈతను ప్రవృత్తిగా ఎంచుకుని పనిచేస్తున్నాయి. వంశపారంపర్యంగా నేర్చుకున్న ఈతతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తొడెంగుల యాదగిరి, తొడెంగుల కృష్ణ (కిట్టు), తొడెంగుల రాజేందర్, నాగరాజు, మహేష్, శ్రీరంగం, చంద్రం, ఎయ్య రాజు, చామంతుల కనకయ్య, వాజీద్ వీరంతా గజ ఈతగాళ్ల బ్యాచ్‌గా ఏర్పడ్డారు. ఎక్కడ ఎవరు నీళ్లలో పడిపోయినా, నీటిలో దూకి ఆత్మహత్య చేసుకున్నా వీరు టీమ్‌లుగా వెళ్లి మృతదేహాలను వెతికి పైకి తెస్తుంటారు. సిద్దిపేట జిల్లానే కాకుండా చాలాసార్లు ఇతర జిల్లాలకు కూడా వెళ్లి రెస్క్యూ ఆపరేషన్లు చేసి వస్తుంటారు. పండుగలు, ఫంక్షన్లు ఉన్నా కూడా పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ వచ్చిందా వాళ్ల పనిముట్లు తీసుకుని రెస్క్యూకు వెళ్లాల్సిందే. అర్ధరాత్రి, అపరాత్రి అని తేడా ప్రాణాలు పణంగా పెట్టి చెరువు, బావుల్లో దూకాలి. ఎముకలు కొరికే చలిలో సైతం నీళ్లలోకి దిగాలి. ఇంత చేస్తున్నా కూడా సత్కారాల కంటే చీత్కారాలే ఎక్కువ ఉన్నాయని గజ ఈతగాళ్లు తమ అనుభవాలను పంచుకున్నారు.

ఎన్నో కష్టాలకోర్చి..

నీళ్లలో పడిపోయిన శవాలను తీయటం కొన్నిసార్లు పెద్ద సమస్యగా మారుతుందని, గంటల తరబడి, రోజుల తరబడి వెతికాల్సి వస్తుందని తెలిపారు. నీటిలో మృతదేహాలను కనిపెట్టడం ఒక ఎత్తైతే.. వాటిని పైకి తేవటం మరో ఎత్తని, కొనిసార్లు శవాల శరీర భాగాలు ఊడిపోయి తమ చేతుల్లోకి వస్తుంటాయని చెప్పారు. ముళ్లపొదల్లో చిక్కుకున్న శవాలు తీయటానికి నానాతంటాలు పడాల్సి వస్తుందని, పురుగులు పట్టిన బాడీని పట్టుకున్నప్పుడు దుర్వాసనతో పాటు పరుగులు మాపైకి ఎక్కుతుంటాయని చెప్పారు. ఇప్పటివరకు దాదాపు 15 అనాథ శవాలకు అంత్యక్రియలు కూడా చేసినట్లు తెలిపారు. మృతదేహాల వెలికితీతతో కొన్నిసార్లు న్యాయపరమైన ఇబ్బందులు కూడా ఎదురవుతుంటాయన్నారు. గతంలో ఎన్సాన్‌పల్లికి చెందిన ఒకరు చెరువులో పడిపోయాడని వారి బంధువులు ఇబ్బంది పెడితే దూకి తీశామని, తీరా మృతదేహంపై తమ వేలిముద్రలున్నాయని సుమారు 10 సంవత్సరాలు కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చిందని ఉదాహరించారు. ఇలా చెబుతూపోతే చాలా ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం తరుపున ఎలాంటి సహాయం అందడంలేదని వాపోతున్నారు. నీళ్లలో దూకేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కోరుతున్నారు. మెడికల్ కిట్, ఆక్సిజన్ అందుబాటులో పెడితే బాగుంటుదంటున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రభుత్వం తమను గుర్తించి గుర్తింపు కార్డులు అందజేయాలని కోరుతున్నారు. ఎంతోకొంత కుటుంబం గడవడానికి జీవనోపాధి చూపిస్తూ, పనిచేసేటప్పుడు మాకు ఏదైనా జరగరానిది జరిగితే కుటుంబానికి ఆర్థికంగా భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు.

సెల్‌ఫోన్‌లు, డ్రోన్‌లు, విగ్రహాలూ..

పర్యాటకుల సెల్‌ఫోన్‌లు, డ్రోన్ కెమెరాలు నీళ్లలో పడిపోయినా వారి సమచారం మేరకు వెతికి ఇస్తుంటామని చెబుతున్నారు. వినాయక విగ్రహాలు, అమ్మవారి ప్రతిమలు నిమజ్జనం తర్వాత వాటిని నీళ్లలో నుంచి బయటకు తెస్తామని, ఆ సమయంలో కూడా చాలా ప్రమాదాలు జరుగుతాయంటున్నారు. డైవ్ చేసినప్పుడు విగ్రహాల్లో తల ఇరుక్కొని ఇద్దరు చనిపోయారని గుర్తుచేసుకుని బాధను వ్యక్తం చేశారు.



మృతదేహాన్ని బయటకు తెస్తున్న గజ ఈతగాళ్లు (ఫైల్)

వంశపారంపర్యంగా చేస్తున్నాం: తొడెంగల యాదగిరి

వంశపారంపర్యంగా ఇదే పని చేస్తున్నాం. నేను 40 ఏళ్ల నుంచి ఇదే పనిలో ఉన్నాను. నా కొడుకు కూడా ఈ పనికే వస్తున్నాడు. ప్రభుత్వం నుంచి ప్రతినెలా కొంత ఆర్థిక సాయం అందిస్తే మాకు చేదోడువాదోడుగా ఉంటుంది. గతంలో వచ్చేవి కానీ ఇప్పుడు రావటం లేదు.

సేఫ్టీ కిట్‌లు అందించాలి : తొడెంగల కృష్ణ

కొన్నిసార్లు ప్రమాదవశాత్తు మావాళ్లు కూడా చనిపోతున్నారు. ఎమర్జెన్సీ సమయంలో వాడేందుకు ఆక్సిజన్, మెడికల్ కిట్ అందుబాటులో పెట్టాలి. దూర ప్రాంతాలకు వెళ్లాడానికి వీలుగా ఒక వాహనం ఏర్పాటు చేయాలి. టోల్ టాక్స్ నుంచి మాకు మినాహాయింపు ఇవ్వాలి.

మాకు ప్రభుత్వం నుంచి గుర్తింపు కావాలి : తొడెంగల రాజేందర్

ప్రాణాలు పణంగా పెట్టి నీళ్లలోకి దూకుతాం. మా పనికి ప్రభుత్వం నుంచి గుర్తింపు కావాలి. ఈ విషయమై పలువురికి వినతిపత్రాలిచ్చినా ప్రయోజనం లేదు. ప్రస్తుత ఏసీపీ మధు సార్, మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్‌కుమార్ సార్ మాకు సత్కరించడం ఆనందంగా అనిపించింది.



దత్తగిరి ఆశ్రమంలో పూజలు చేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

రైతులు, ప్లాట్ల యజమానులు నష్టపోకుండా చూడాలి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైవే పనుల్లో భాగంగా రైతులు నష్టపోకుండా చూడాలని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందరావు నేషనల్ హైవే అథారిటీ రిజినల్ అధికారి కృష్ణప్రసాద్‌కు సూచించారు. గురువారం సాయంత్రం హైదరాబాదులోని ఎన్‌ఎచ్‌ఏఐ కార్యాలయంలో ఆయనతో ఎంపీ సమావేశమయ్యారు. ఎల్కతుర్తి నుంచి రామాయంపేట వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవేతో నష్టపోతున్న రైతులతో వెళ్లి కలిశారు. బ్లాక్ ఆఫీస్ నుంచి రంగధాంపల్లి వరకు నిర్మిస్తున్న అండర్ పాస్, ఎన్సాన్‌పల్లి చౌరస్తా (సర్దార్ పాపన్న గౌడ్) వద్ద నిర్మిస్తున్న గోడతో కూడిన ఫ్లైఓవర్ వల్ల రైతులు, ప్లాట్ల యజమానులకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలను చూపి రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన అధికారులు నష్టం వాటిల్లకుండా రీ డిజైన్ చేసి పంపిస్తామని హామీ ఇచ్చారు.

దత్తగిరి ఆశ్రమంలో ఎంపీ పూజలు..

ఝరాసంగం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆశ్రమ బావిపీఠాధిపతి డా.సిద్దయ్యస్వామి శాలువ, పూలమాలలతో ఎంపీని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడదీయడం సరికాదు

● జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్



ధర్మారం గ్రామానికి చేరుకున్న మాలల మహాపాదయాత్ర

దుబ్బాక/మిరుదొడ్డి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వర్గీకరణపేరుతో ఎస్సీలైన మాలమాదిగలను విడదీయడం సరికాదని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. గత నెల 25న భద్రాచలంలో చేపట్టిన మాలల మహాపాదయాత్ర శుక్రవారం మిరుదొడ్డి మండలం ధర్మారం, దుబ్బాక మండలం హబ్షీపూర్, దుబ్బాక పట్టణానికి చేరుకుంది. స్థానికంగా ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీలను విడదీసి రాజకీయంగా అణగదొక్కలానే కుట్రలో భాగంగా ఎస్సీ వర్గీకరణను చేపట్టిందన్నారు. ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా, దళితుల ఐక్యతకోసం మాలల మహాపాదయాత్రను చేపట్టినట్లు గుర్తుచేశారు. డిసెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల మహాసంగ్రామసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నరాజు, సత్యానారాయణ, అంజయ్య, ర్యాకం శ్రీరాములు, భీమసేన, పురుశోత్తం, రాజేశం, దేవయ్య, యాదగిరి, కాల్వలింగం, రాజయ్య, సాయిలు, శేఖర్, రాజు, స్వామి తదితరులున్నారు.

భార్యతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని..

అంతమొందించాడు

- వ్యక్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడి రిమాండ్



తూప్రాన్‌లో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రంగా కృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్

మనోహరాబాద్, నవంబరు 22: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులో గత శనివారం రాత్రి ప్రమోద్ కూమార్ పాశ్వాన్ అనే వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను తూప్రాన్ సీఐ రంగా కృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్ శుక్రవారం వెల్లడించారు. హైదారాబాద్‌కు చెందిన పాండరీ శ్రీరామ్ కాళ్లకల్ గ్రామ శివారులో నూతనంగా ఇల్లును నిర్మిస్తున్నారు. ఇంటి పనులను పంజాబ్ రాష్ట్రానికి చెందిన ప్రమోద్ కూమార్ పాశ్వాన్ మేస్త్రీకి గుత్తకు ఇచ్చాడు. దీంతో ప్రమోద్ కూమార్ పాశ్వాన్ వద్ద బీహర్ రాష్ట్రానికి చెందిన బిట్టు తోపాటు అతడి భార్యాపిల్లలు ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమోద్ పాశ్వాన్ బిట్టు భార్య పూజను పలుమార్లు తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. గత శనివారం కూడా పూజతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో బిట్టు ప్రమోద్ పాశ్వాన్‌కు హెచ్చరించాడు. అయినా వినకపోవడంతో బిట్టు కోపంతో పక్కనే ఉన్న కర్రతో పలుమార్లు తలపై మోదాడు. దీంతో ప్రమోద్ పాశ్వాన్ అక్కడికక్కడే మృతి చెందగా... బిట్టు భార్య పిల్లను తీసుకుని అక్కడి నుంచి బీహర్‌కు పారిపోయారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు శుక్రవారం బిట్టును పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. హత్య జరిగిన ఏడు రోజుల వ్యవధిలోనే కేసును ఛేదించిన ఎస్ఐ సుభాష్‌గౌడ్, ఐడీ పార్టీ సిబ్బంది గోవర్ధన్, శ్రీనివాస్ రాథోడ్, కృష్ణ కానిస్టేబుళ్లను సీఐ రంగా కృష్ణ అభినందించారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొట్టిన లారీ

యువకుడి దుర్మరణం

● మరో ఇద్దరి పరిస్థితి విషమం..



వంశీ(ఫైల్)

మెదక్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయలైన ఘటన పట్టణంలోని పిల్లికొట్యాల్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండల పరిధిలోని శాలిపేట గ్రామానికి చెందిన దాసరం వంశీ(22), తమ్ముడు దాసరం నవీన్, సోదరి భ్యాగతో కలిసి పల్సర్ బైక్‌పై శుక్రవారం మధ్యాహ్నం సంగాయిపల్లి నుంచి పని నిమిత్తం మెదక్‌కు వస్తున్నారు. పిల్లికొట్యాల్ సమీపంలో మెదక్ నుంచి చేగుంట వైపు ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా వచ్చి వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వంశీ అక్కడికక్కడే మృతి చెందగా.. నవీన్, భాగ్యకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడినవారిని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది. వంశీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి మామ రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు.

నీట మునిగి వ్యక్తి..



సాయిలు(ఫైల్)

పాపన్నపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయ సమీపంలోని మంజీరా చెక్ డ్యాంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన చాకలి సాయిలు(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఓ విందు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఏడుపాయలకు వచ్చాడు. దర్శనం అనంతరం సాయంత్రం సమయంలో అందరూ కలిసి ఆలయ సమీపంలోని ఉన్న చెక్ డ్యాం వద్దకు వెళ్లగా. సాయిలు స్నానం చేసేందుకు అందులోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి ఊపిరాడక మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రాణి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



వెంకటేష్(ఫైల్)

శివ్వంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొంతాన్ పల్లి గ్రామానికి చెందిన కుల్ల వెంకటేష్(24) దినసరి కూలీ. కొన్ని రోజులుగా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో పాటు తన తల్లి కోసం ఏమి చేయలేకపోతున్నానని మనోవేదనతో బుధవారం రాత్రి తమ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూసైడ్ నోట్‌లో 'పొలం జాగ్రత్త.. చెల్లి పెళ్లి చేయాలి' అని అమ్మకు సూచినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

వివాహిత అదృశ్యం



రేణుక(ఫైల్)

రామచంద్రాపురం, నవంబరు 22 : వివాహిత అదృష్యమైన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొమురంభీంకాలనీలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం కాలనీకి చెందిన వైశ్రీరాములు తన కూతురు రేణుక(20)కు టేక్మాల్‌కు చెందిన పంతులు గణేష్‌తో 6 నెలల క్రితం వివాహం చేశారు. వారం క్రితం రేణుక తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. శుక్రవారం ఉదయం బయటకని వెళ్లిన రేణుక ఎంతకీ తిరిగి రాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాసేవకు అంకితం కావాలి

- మెదక్ జిల్లాకు 149 మంది కొత్త కానిస్టేబుళ్ల కేటాయింపు
- రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ విధులు నిర్వర్తించాలి
- మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



కానిస్టేబుల్‌కు ఆర్డర్ కాపీని అందజేస్తున్న మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): సమాజం పట్ల విశ్వసనీయత పెంపొందించేలా ప్రజాసేవకు అంకితం కావాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాకు కొత్తగా కేటాయించిన 149 మంది కానిస్టేబుళ్లకు ఎస్పీ ఆర్డర్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజానికి అత్యున్నతమైన సేవలు అందించే అవకాశం ఉన్న పోలీస్‌శాఖలో చేరి శిక్షణ పూర్తి చేసుకుని నేటి నుంచి పూర్తి బాధ్యతల్లో చేరారన్నారు. శిక్షణ సమయంలో అవవర్చుకున్న క్రమశిక్షణ రాబోయే రోజుల్లో కూడా అనుసరించాలన్నారు. ప్రజల రక్షణే బాధ్యతగా పని చేయాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించకుండా రాజ్యాంగ ధర్మాని పాటిస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం సమవర్థంతంగా విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లాకు కేటాయించిన 149 కొత్త కానిస్టేబుళ్లల్లో సివిల్ 52, సివిల్ మహిళా 26, సాయుధ దళ 56, మహిళా సాయుధ దళ 15 మంది ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

● సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకొని జిల్లాలో రిపోర్ట్ చేసిన కానిస్టేబుళ్లకు కంది మండలం చిద్రూప్ప లోని పోలీసు శిక్షణ కేంద్రంలో గురువారం రాత్రి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధులల్లో చేరుతున్న కానిస్టేబుళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. అంకిత భావంతో పని చేస్తూ పోలీసుస్టేషన్‌కు వచ్చేవారితో, అధికారులు, సహచర కానిస్టేబుళ్లతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో పూర్తి నిబద్దతతో విధులు నిర్వహించాలన్నారు. సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఫిజికల్‌గా, మానసికంగా ఫిట్‌గా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోగలమన్నారు. నూతన చట్టాల గురించి నిరంతరం తెలుసుకుంటూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో జాగ్రత్తగా ఉండాలని, ఏది అవసరం, ఏది అనవసరం అనేది గుర్తెరిగి నడుచుకోవాలని సూచించారు. సిబ్బంది అందరు తమకు కేటాయించిన హెడ్ క్వార్టర్ నందు అందుబాటులో ఉండాలని, అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. అధికారుల ఆదేశాలను పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, ఆఫీసు సూపరింటెండెంట్లు అశోక్, వెంకటేశం, మినిస్టీరియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అరెస్ట్

- చనిపోయిన సోదరుడి పేరిట ఉన్న భూమి కాజేసే యత్నం
- గెజిటెడ్ అధికారి సంతకం ఫోర్జరీ.. పోలీసులకు ఫిర్యాదు



నిందితుడిని విలేకరులకు చూపుతున్న పోలీసులు

జోగిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన సోదరుడి పేరిట ఉన్న 2.11 ఎకరాల వ్యవసాయ భూమిని కాజేసేందుకు గెజిటెడ్ అధికారి సంతకం ఫోర్జరీ చేసిన కేసులో జోగిపేట వ్యసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జోగిపేట ఎస్ఐ పాండు శుక్రవారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డీబీ నాగభూషణం (54) సొంత అన్న బుడాల రాములు గతేడాది మృతి చెందారు. ఆయనకు సర్వే నెంబరు 217లో 2.11 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, దానిని కాజేసేందుకు నాగభూషణం పన్నాగం పన్నాడు. అన్న మృతి చెందిన విషయాన్ని దాచి ఉంచి అతని పేరిట ఉన్న పాస్ బుక్ కరెక్షన్ కోసమంటూ గత ఏప్రిల్ 1న అందోలు తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ దరఖాస్తులో భూషణం తన సొంత మొబైల్ నెంబర్‌ను పేర్కొన్నాడు. దరఖాస్తు పరిశీలనలో భాగంగా, తహసీల్దారు సదరు నెంబరుకు ఫోన్ చేసి సదరు భూమికి సంబంధించిన రైతువారీ పట్టా ధ్రువపత్రం సమర్పించమని కోరారు. అన్న పేరిట తప్పుడు రైతువారీ ధ్రువపత్రాన్ని తయారు చేయడమేగాకుండా, అన్న మరణ ధృవపత్రపు జిరాక్స్ కాపీపై శ్రీకాంత్ అనే గెజిటెడ్ అధికారి సంతకం తీసుకుని, ఆయన స్టాంప్‌ను కూడా వేయించుకున్నాడు. మరణ ధ్రువీకరణపత్రంపై ఉన్న గెజిటెడ్ అధికారి సంతకం, స్టాంప్‌ను ఫోన్లో క్రాప్ చేసి, దానిని కలర్ ప్రింట్ తీసి, తాను తయమారు చేయించిన దొంగ రైతువారీ పట్టాపై కలర్‌ప్రింట్ తీసి.. అదే నిజమైన రైతువారీ పట్టాగా, తహశీల్దారు కార్యాలయంలో సమర్పించాడు. ఈవిషయమై జరిపిన విచారణలో ధ్రువపత్రం ఫోర్జరీదని తేలింది. దీంతో డిప్యూటీ తహసీల్దారు సాగర్ మధుకర్ రెడ్డి పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం నాగభూషణంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కూతురితో తండ్రి అసభ్య ప్రవర్తన

● కేసు నమోదు

టేక్మాల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రే సొంత కూమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తిండంతో పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. టేక్మాల్ ఎస్ఐ రాజేశ్ కథనం ప్రకారం.. టేక్మాల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తన కుమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె భయపడిపోయింది. దీంతో తల్లితో కలిసి అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లింది. కొద్దిరోజుల తర్వాత తండ్రి వెళ్లి మాయమాటలు చెప్పి.. మంచిగా ఉంటానంటూ బతిమిలాడి భార్య, కుమార్తెను ఇంటికి తెచ్చుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత మళ్లీ అలాగే ప్రవర్తించడంతో తల్లితో కలిసి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో మూడేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన కేసులో దోషికి 3సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాదికారి కె.జయంతి శుక్రవారం నాడు తీర్పు చెప్పారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన మహేంద్ర జగదీష్ అలియాస్ మ్యాతరి జగన్ (20) అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను 2019లో కిడ్నాప్ చేశాడు. ఈ మేరకు పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో ఆదారాలు సమర్పించగా నేరం రుజువైంది. దోషికి 3సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు.

న్యూస్ బాక్స్

ఎల్‌వోసీ అందజేత

నారాయణఖేడ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండలం పెద్ద ముబారక్‌పూర్‌కు చెందిన మొండి భవానీ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అత్యవసర చికిత్స కోసం సీఎం సహాయనిధి ద్వారా రూ.లక్ష మంజూరుకు సంబంధించి ఎల్‌వోసీ జారీఅయ్యింది. ఈ మేరకు ఎల్‌వోసీ మంజూరు ఉత్తర్వులను జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, భవానీ తండ్రి రాములకు శుక్రవారం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంగారెడ్డి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 23న సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో సంగారెడ్డి మండలం ఏఈ ప్రశాంత్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి, ఏపీహెచ్‌బీ కాలనీ, పొన్న కాలనీ, సండే మార్కెట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, బ్యాంక్ కాలనీ, బిద్యానగర్ కాలనీ, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

కేజీబీవీ అభ్యర్థులకు కౌన్సెలింగ్, పోస్టింగ్స్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష పరిధిలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 11 టీచింగ్ పోస్టుల్లో ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించి నియామకపత్రాలు అందజేశారు. అభ్యర్థులు తమకు కేటాయించిన కేజీబీవీల్లో వెంటనే విధుల్లో చేరాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు.

'నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి'

నిజాంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాసంగికి నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయాధికారి సోమలింగారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన దుకాణాలను శుక్రవారం సందర్శించి నాణ్యతలపై పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తీసుకున్న విత్తన, ఎరువుల రశీదును కచ్చితంగా అందించాలన్నారు.

'మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు'

నర్సాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కే.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా మట్టి తవ్వకాలు చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై స్పందించారు. మట్టి తవ్వకాలు చేయాల్సి వస్తే కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు.

'ధాన్యం కొనుగోలులో ఆలస్యం జరుగొద్దు'

పాపన్నపేట/రేగోడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో ఆలస్యం జరుగకుండా చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని ఆర్కెల, నార్సింగి ఐకేపీ కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా, తేమశాతం మించకుండా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. సీరియల్ ప్రకారం ధాన్యం తూకాలు జరుపాలన్నారు. లారీలు వెంట వెంటనే లోడ్ అయ్యేలా, హమాలీలను సమాయత్తం చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం సాయిలు, డ్వాక్రా గ్రూపు మహిళలు, రైతులు ఉన్నారు. రేగోడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ డీపీఎం మోహన్ శుక్రవారం పరిశీలించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

శివ్వంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో బుచ్చా నాయక్ సూచించారు. మండల పరిధిలోని గూడూరులో కేజీబీవీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుని, వంటశాలలో కూరగాయలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.




నక్సల్స్ పేల్చిన పాత పోలీస్‌స్టేషన్ భవనంలో ఆయుర్వేద ఆస్పత్రి, అద్దె భవనంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం

నిలిచిన నిధులు.. ఆగిన పనులు

- ఆరేళ్లుగా ఆగిన రూ.70 కోట్ల నిధులు
- నిధుల లేమితో నిర్మాణ దశలో నిలిచిన భవనాలెన్నో
- వెక్కిరిస్తున్న శిలాఫలకాలు
- శిథిల, అద్దె భవనాల్లో ఆఫీసులు

రామాయంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొరుగు ప్రాంతాలతో పోటీ పడాల్సిన మెదక్ జిల్లా రామాయంపేట తిరోగమనంలో పయనిస్తోంది. ఆరేళ్లుగా రూ.70 కోట్ల పనులకు సంబంధించిన నిధులు నిలిచిపోవడంతో నిర్మాణ దశలో నిలిచిన ప్రభుత్వ భవనాలు.. శిలాఫలకాలు దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. 30 ఏళ్ల క్రితం పాత హైవేను ఆనుకుని ఆర్టీసీ డిపోకు స్థలాన్ని సేకరించి ఆర్టీసీకి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. దశాబ్దం కిందటే ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ మంజూరైంది. అయితే కొత్త హైవే ఏర్పడడంతో బస్సులు లోపలికి రాకపోవడంతో బైపాస్‌పై ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ నిర్మించాలన్న ఆలోచన లేకుండాపోయింది. ఆరేళ్ల క్రితం 20 కోట్ల అభివృద్ధి నిధులు వచ్చాయన్న మాటలు నీటి మూటలయ్యాయి. ఏడాదిక్రితం రూ.50 కోట్లతో వివిధ పనులకు వేసిన శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయి. దీనివల్ల ఎన్నో ఏళ్లుగా ధ్వంసమైన పాత హైవే, అంతర్గత రోడ్లు బాగుకు నోచుకోలేదు. అలాగే రామాయంపేటలో కోటిన్నరతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌కు రూ.30 లక్షలు మాత్రమే విడుదల కావడంతో మూడేళ్లుగా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. 20 ఏళ్ల క్రితం రైతుబజార్‌ను అన్ని హంగులతో నిర్మిస్తామని చెప్పినా.. నేటికీ పూర్తికాలేదు. దీంతో రోడ్లపైనే కూరగాయల మార్కెట్ కొనసాగుతోంది. ఐదేళ్ల క్రితం రామాయంపేట కెనాల్‌కు శంకుస్థాపన చేసినా అతీగతి లేదు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం, పశువుల, ఆయుర్వేద ఆస్పత్రులు శిథిల భవనాల్లో నడుస్తున్నాయి. ఇక బీడీ కార్మిక వైద్య చికిత్సాలయం ఓ చిన్న గల్లీలో నిర్వహిస్తున్నారు. ఇకపోతే నిత్యం ఆదాయాన్ని తెచ్చిపెట్టే రిజిస్ట్రేషన్ కార్యాలయానికీ సొంత భవనం లేని పరిస్థితి. పట్టణంలో బీసీ హాస్టల్, యూత్ బిల్డింగ్ లాంటివి వృథాగా ఉన్నా అద్దె భవనాల్లో నడుస్తున్న కార్యాలయాలు అందులోకి మార్చాలని అధికారులు ఆలోచన చేయడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సమస్యలు తీరుతాయో వేచిచూడాలి.

గిరిజనులు జరుపుకునే దసరా ఎంతో ప్రత్యేకం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



దసరాలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్

పాపన్నపేట/చిన్నశంకరంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు జరుపుకునే సంప్రదాయ పండుగ అయిన దసరా ఎంతో ప్రత్యేకమని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోదుగులకుంటతండాలో జరిగిన దసరా ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదట జగదాంబికా మాత, సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండ కోనల్లో నివసించే గిరిజనులు కొండలు పిండి చేసి, రాళ్ల భూములను రతనాల భూములుగా మార్చి, శ్రామిక జీవనానికి ప్రతిరూపంగా నిలిచారన్నారు. అంతకుముందు ఆయన భూముల సమస్యలపై రైతులతో మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్ అధికారులపై ఆగ్రహం

మోదుగులకుంటతండా పర్యటనలో ఉండగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఎమ్మెల్యే విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఎందుకుపోయిందో కారణం తెలపాలని ఏఈని ఆదేశించారు. విద్యుత్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. బాచారంలో 24 నుంచి జరుగనున్న ఉర్సుకు సంబంధించి విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోవింద్‌నాయక్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, గౌస్, శ్రీనివాస్, నరేందర్‌గౌడ్, గిరిజనులు పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే రోహిత్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, అధికారులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు: విష్ణువర్ధన్‌రెడ్డి



పొగాకు నియంత్రణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు

కొండాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యసనాలకు బానిసై యువత కుటుంబాలను, జీవితాన్ని నాశనం చేసుకోకూడదని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి పొగాకు నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. బస్టాండ్, మార్కెట్ తదితర ప్రాంతాలల్లో పొగాకు వాడకం ద్వారా కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీల సమరభేరిని విజయవంతం చేయండి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్



బీసీల సమరభేరి సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఈ నెల 25న రాజకీయాలకతీతంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే బీసీల సమరభేరి సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో బీసీల సమరభేరి సభకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు బీసీల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని విమర్శించారు. 60 శాతం ఉన్న బీసీలకు రాయితీల మత్తులో తరతరాలుగా మోసగిస్తూనే ఉన్నారని, బీసీలు రాజ్యాధికారం దిశగా ఎదిగిననాడే అనగారిన కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్‌యాదవ్, నాయకులు వెంకటేష్‌గుప్త, జగదీశ్వర్ సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకే గ్రౌండ్ బేస్ లెర్నింగ్

మెదక్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థిలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి గ్రౌండ్ బేస్ లెర్నింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... ఉపాధ్యాయులు క్రియేటివ్‌గా ఆలోచించి పిల్లలకు వివిధ సబ్జెక్టుల్లో నాణ్యమైన గుణాత్మ విద్యనందించాలన్నారు. గ్రౌండ్ బేస్ లెర్నింగ్ కార్యక్రమాన్ని 20 అంశాలతో రూపొందించామన్నారు. అనేక అంశాలు విద్యార్థి భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్నారు. విద్య, పుస్తకాలు, పాఠ్యాంశాలు మాత్రమే కాకుండా విద్య వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో అనేక అంశాలను పరిగణలోకి వస్తాయన్నారు. సైద్ధాంతిక, పాఠ్యాంశాల ఆధారిత విద్య కాకుండా విద్యార్థి వ్యక్తిత్వం అభివృద్ధి చేయడంలో సహాయపడుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మార్కులతోనే సరిపెట్టుకోకుండా నైపుణ్యాలతో కలిగిన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి, ఎంఈవోలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్ వైద్యశాల తనిఖీ

నారాయణఖేడ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఖేడ్ ఏరియా వైద్యశాలను శుక్రవారం జిల్లా ప్రాంతీయ వైద్యశాలల కోఆర్డినేటర్ సంగారెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాలలో రోగులకు అందిస్తున్న చికిత్సలు, సేవలను పరిశీలించడమే కాకుండా సిబ్బంది హాజరు విధానం, మందుల నిల్వల రికార్డులు, వైద్యశాల నిర్వహణ తీరును పరిశీలించారు. మూడునెలలుగా సేవలు మెరుగుపర్చడం హర్షణీయమన్నారు. మూడునెలల క్రితం వైద్యశాలలో ప్రసవాలు నెలకు 60లోపే జరుగుతుండగా, ప్రస్తుతం ప్రతీనెల 80 నుంచి 90 వరకు జరుగుతున్నాయన్నారు. ఈనెలలో ఇప్పటివరకు 70 ప్రసవాలు దాటాయన్నారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ రమేష్‌ను అభినందించారు.

పౌర సరఫరాల గోదాంలో...

నారాయణఖేడ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ శివారులోని మార్కెట్‌యార్డు ఆవరణలో ఉన్న పౌర సరఫరాల గోదాంను శుక్రవారం స్థానిక ఆర్డీవో అశోకచక్రవర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలలో ఉన్న నిల్వలు, దుకాణాలకు పంపిణీ చేసిన బియ్యం వివరాలు, రికార్డులు, తూకం వేస్తున్న తీరు పరిశీలించారు. చౌక ధరల దుకాణాలతో పాటు విద్యాసంస్థలకు సరఫరా చేయడంలో ఆలస్యం లేకుండా సకాలంలో పంపిణీ చేయాలని గోదాం ఇన్‌చార్జి హరిబాబుకు సూచించారు.

'గర్భిణులు, బాలింతలు పోష్టికాహారాన్ని తీసుకోవాలి'

శివ్వంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, పిల్లలు ఆరోగ్యం కోసం అదనపు పోషకాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్టు సీడీపీవో హేమభార్గవి తెలిపారు. శుక్రవారం మండలంలోని తాళ్లపల్లితండా అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతినెల రెండు చొప్పున సామాజిక వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్ సంతోష పాల్గొన్నారు.

స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ ఇలాగేనా?

ఐదోపేజీ తరువాయి

సందర్శించి రోగులకు అందిస్తున్న మందులు, స్టాక్ వివరాలు పరిశీలించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి వచ్చిన ఇండెంట్ ఆధారంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టాక్‌ను క్షుణంగా పరిశీలించారు. ఆన్‌లైన్‌లో ఉన్న వివరాలతో స్టోర్‌లో ఉన్న నిల్వలు సరిపోలకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ-ఔషధి పోర్టల్‌లో మందుల వివరాలు సక్రమంగా నమోదు చేసినప్పటికీ, ఫిజికల్ స్టాక్‌కు సరిపోలడం లేదని అసహనం వ్యక్తం చేశారు. వచ్చిన డ్రగ్ స్టాక్ వివరాల రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడాన్ని టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు గుర్తించారు. రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకుండా ఏం చేస్తున్నారని, టైంపాస్ చేస్తున్నారా? జీతం ఇచ్చేది పనిచేయడానికే కదా అంటూ ఫార్మసీ సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో తమరి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లే సంబంధిత అధికారులకు చెడ్డపేరు వస్తుందన్నారు. ఆరు నెలల్లో కాలం చెల్లె మందులన్నీ ఒక దగ్గర ఉంచాలని, అంతే కాకుండా మందుల ర్యాక్‌ల నిర్వహణపై పలు సూచనలు చేశారు. రెండు వారాల్లో మళ్లీ వస్తామని రికార్డుల నిర్వహణ, పనితీరు మార్చుకోవాలని ఫార్మసీ సూపర్‌వైజర్‌ను అడిషనల్ డైరెక్టర్ డా.సుధీర హెచ్చరించారు. పక్కగా డ్రగ్‌స్టోర్ రికార్డుల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్ ఆమెకు సర్దిచెప్పారు. అంతకుముందు సెంట్రల్ డ్రగ్‌స్టోర్, డీఎంహెచ్‌వో ఆఫీస్ డీఐవో సెక్షన్‌లోని వ్యాక్సిన్ కోల్డ్‌చైన్ నిర్వహణతో పాటు మార్క్స్‌నగర్ యూపీహెచ్‌సీ, చింతల్‌పల్లి బస్తీ దవాఖానా, ఆత్మకూర్ పీహెచ్‌సీ, నందికంది పల్లె దవాఖానాలను సందర్శించి మందుల వివరాలు, వ్యాక్సిన్ కోల్డ్‌చైన్ నిర్వహణను పరిశీలించారు. వారివెంట ఆర్ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్, డీఐవో డా.శశాంక్‌దేశ్‌పాండే, చీఫ్‌డైటీషియన్ బాలస్వామి, సీడీఎస్ ఫార్మసిస్ట్ ముబీన్‌ఫాతిమా, ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో అభివృద్ధి బాగుంది

- ఒడిశా బృందం కితాబు



మల్కాపూర్‌ను సందర్శించిన ఒడిశా బృందం

తూప్రాన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మల్కాపూర్ అభివృద్ధి చాలా బాగుందని ఒడిశా ప్రజాప్రతినిధుల బృందం కితాబు ఇచ్చింది. ఒడిశా రాష్ట్రం సుందర్‌గడ్ జిల్లా ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ అధికారుల బృందం నాలుగురోజుల పర్యటనకు రాష్ట్రానికి విచ్చేయగా, శుక్రవారం తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామాన్ని సందర్శించారు. మల్కాపూర్‌లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇంకుడుగుంతలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రాక్ గార్డెన్ నిర్మాణం, డంపింగ్‌యార్డు, పలు ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. టీజీఎస్ఐఆర్డీ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సుందర్‌గడ్ జిల్లాకు చెందిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, బ్లాక్ లెవల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మల్కాపూర్‌ను సందర్శించగా, మహిళలు బతుకమ్మ ఆటలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, ఎంపీడీవో శేషాద్రి, తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీవో సతీష్, ఐకేపీ ఏపీఎం రుక్మిణీ, మాజీ సరపంచ్ మహదేవినవీన్, ఉపసర్పంచ్ ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

'ధరణి సమస్యలు పెండింగ్‌లో ఉండొద్దు'

కొండాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ధరణి సమస్యలు పెండింగ్ ఉండకుండా సత్వరమే పరిష్కారం చూపాలని ఆర్డీవో రవీందర్‌రెడ్డి మండల రెవెన్యూ అధికారులకు సూచించారు. శుక్రవారం తొగర్‌పల్లి శివారులో సర్వే నంబరు 418లో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ భూమిని అదనపు కలెక్టర్ మాధురితో కలిసి పరిశీలించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు, భూముల రిజిస్ట్రేషన్లు తదితర అంశాలపై ఆరాతీశారు. ఆయనవెంట డీటీ ప్రదీప్, ఆర్ఐ మహదేవ్, సర్వేయర్ సైదులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎంసీహెచ్‌లో 'ఫైర్ సేఫ్టీ' మాక్‌డ్రిల్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో (ఎంసీహెచ్) ఫైర్ సేఫ్టీపై శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మంటలు వ్యాపించినప్పుడు అగ్నిప్రమాద నివారణ పరికరం ద్వారా ఆర్పే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. సంగారెడ్డి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్, ఆర్ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్, నర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోత్తంగా రుక్మిణీ పాండురంగస్వామి పూర్ణాహుతి, రథోత్సవం

కంది, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కందిలోని రుక్మిణీ పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పూర్ణాహుతి, హోమం, రథోత్సవం ఆలయ ధర్మకర్తలు సునీల్‌దేశ్‌ముఖ్, దీపక్ దేశ్‌ముఖ్ పర్యావేక్షణలో ప్రారంభమయ్యాయి. ఈ రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామా నుంచి వేలాదిగా భక్తులు హాజరై స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు మధుసూదన్‌రావు పంతులు, శ్రీను పంతులు, మాజీ వార్డుసభ్యులు జంగయ్య, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభానికి మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం నాగాపూర్ (అంతాయపల్లి) గ్రామానికి వెళ్లే రహదారిలో హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేసి సరిచేశారు. నాగాపూర్ గ్రామ సమీపంలో నేలకొరిగేలా విద్యుత్ స్తంభం ఉండడంతో ఈనెల 18న 'రేపో మాపో నేలకొరిగేందుకు విద్యుత్ స్తంభం' అన్న శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి, స్తంభాన్ని సరిచేశారు.

మార్కెట్ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి

రామచంద్రాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం పట్టణంలోని సండే మార్కెట్ సీసీరోడ్డు నిర్మాణానికి జీహెచ్ఎంసీ రూ.కోటి మంజూరు చేసిందని, త్వరలోనే రోడ్డు నిర్మాణం, సుందరీకరణ పనులు ప్రారంభిస్తామని జీహెచ్ఎంసీ 112 డివిజన్ రామచంద్రాపురం కార్పొరేటర్ బి.పుష్ప తెలిపారు. శుక్రవారం సండే మార్కెట్ వద్ద రూ.17 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించి, ఆమె మాట్లాడారు.

సైన్స్ పట్ల అభిరుచి పెరుగుతుంది

- మెదక్ జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

నర్సాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక నిర్వహించే పలు కార్యక్రమాల వల్ల మూఢ నమ్మకాలను పారదోలడంతో పాటు సైన్స్ పట్ల అభిరుచి పెంపొందించడానికి ఉపయోగపడుతాయని మెదక్ జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జేవీవీ ఆధ్వర్యంలో ఎల్లంకి కాలేజీలో చెకుముకి సైన్స్ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో వైజ్ఞానిక అవగాహనతో పాటు వారి తెలివితేటలు బయటకు తీసేందుకు నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎంఈవో తారాసింగ్, ఎల్లంకి కాలేజీ ప్రిన్సిపాల్ అశోక్, రిటైర్డ్ హెచ్ఎం షఫియోద్దీన్, జేవీవీ మండలాధ్యక్షుడు పండరి, ప్రధాన కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

పంట కోసిన తర్వాత మొదళ్లను తగులబెట్టొద్దు



వై.ఝాన్సీలక్ష్మి

సంగారెడ్డి అర్బన్/చిన్నశంకరంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరి పంట కోసిన తర్వాత మొదళ్లను తగులబెట్టొద్దని సంగారెడ్డి మండల వ్యవసాయాధికారి(ఏవో) వై.ఝాన్సీలక్ష్మి ఒక ప్రకటనలో సూచించారు. రైతులు వరి మొదళ్లను కాల్చడం వల్ల భూమిలో ఉండే వివిధ రకాల సూక్ష్మజీవులు కాలిపోయి భూమి సారవంతం కోల్పోతుందని తెలిపారు. అంతకుముందు వ్యవసాయశాఖ ఏడీఏ వెంకటలక్ష్మితో కలిసి రాజంపేటలోని వరి పంటను పరిశీలించారు. వరికొయ్యలు తగులబెడితే పంటకు నష్టం కలుగుతుందని చిన్నశంకరంపేట మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ రైతులకు సూచించారు.

'మంథన్'కు దేశంలో 16, రాష్ట్రంలో 3వ స్థానం

రామచంద్రాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ ర్యాంకింగ్స్ (2024-25)లో దేశంలోని 20 పాఠశాలలో హైదరాబాద్ (తెల్లాపూర్ శాఖ) దేశవ్యాప్తంగా 16, తెలంగాణలో 3వ ర్యాంకును సాధించిందని మంథన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుర్జీత్‌సింగ్ శుక్రవారం తెలిపారు. తమ పాఠశాల దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం గర్వంగా ఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రుచిక మాట్లాడుతూ మంచి వసతులతో పాటు అంకితభావంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యనందించడం తల్లిదండ్రుల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు.

'యువత చెడు వ్యసనాలతో చిత్తు కావద్దు'

పాపన్నపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు వ్యసనాలతో పాటు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. శుక్రవారం ఏడుపాయల్లో జైభీం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ ఇటీవల యువత గంజాయి, డ్రగ్స్, మద్యపానం, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను ఆగం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'సర్వే డేటా ఎంట్రీ నుంచి మినహాయించాలి

మెదక్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని అదనపు కలెక్టర్ మెంచు నగేష్‌కు ఉపాధ్యాయ సంఘాలు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కొంగటి యాదగిరి, వెంకట్‌రామ్‌రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఈఎల్స్‌ను మంజూరు చేయాలన్నారు.

సర్వే 97 శాతం

ఐదోపేజీ తరువాయి

వివరాలు కూడా తెలిపేందుకు ముందుకు రాలేదన్నారు.

డేటాఎంట్రీ పారదర్శకంగా చేయాలి : కలెక్టర్

సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆపరేటర్లకు సూచించారు. హవేళీఘణపూర్ మండల కేంద్రంలో డాటా ఎంట్రీ నమోదు ప్రక్రియను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం డాటాఎంట్రీ ప్రక్రియపై ఆయన కంప్యూటర్ ఆపరేటర్లు, మండల అభివృద్ధి అధికారులు, ప్రత్యేకాధికారులతో తన కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే వివరాలను పొరపాట్లకు తావులేకుండా పక్కాగా నమోదు చేయాలని సూచించారు. కోడింగ్ విధానాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు.

మెదక్ మున్సిపాలిటీలో 100 శాతం..

మెదక్ మున్సిపాలిటీ: సమగ్ర సర్వే మెదక్ జిల్లాకేంద్రంలో శుక్రవారంతో ముగిసింది. మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డుల్లోని 1,2168 కుటుంబాల వివరాలను నమోదు చేసినట్లు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సర్వేకు వెళ్లినప్పుడు అందుబాటులో లేనివారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చి వివరాలు నమోదు చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. సర్వే అనంతరం జిల్లాకేంద్రంలో కుటుంబాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సర్వే ముగియడంతో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో డాటాఎంట్రీ ప్రక్రియ ప్రారంభించారు. ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. 56 అంశాలతో కూడిన నమూనాలో ప్రతీ అంశాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆపరేటర్లకు సూచించారు.

సంగారెడ్డి జిల్లాలో 3,48,901 కుటుంబాలు

సంగారెడ్డి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నది. శుక్రవారం వరకు 85 శాతానికి పైగా ఇళ్లలో సర్వే పూర్తిచేసినట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 638 గ్రామ పంచాయతీలు, 8 మున్సిపాలిటీ పరిధిలోని 199 వార్డుల్లో సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 4,10,049 ఇళ్లకు గాను ఇప్పటి వరకు 3,48,901ఇళ్ల వివరాల సేకరణ పూర్తిచేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను శక్రవారం మొదలు పెట్టినట్లు తెలియజేశారు. తొలిరోజు 1,417 ఇళ్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వివరించారు. ఇప్పటివరకు ఇంటింటికి తిరుగుతూ సేకరించిన డాటాను ఎంపీడీవో ఆఫీసులు, మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో సర్వేను ముగించి.. వారంలో డాటాఎంట్రీ ప్రక్రియను పూర్తిచేసేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.